క్లుప్తంగా

కేజీబీవీలో మానసిక ఆరోగ్య దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఏపీసీ జయప్రకాష్ తదితరులు

సబ్బవరం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం, కెరీర్ డే కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అనకాపల్లి సమగ్ర శిక్ష ఏపీసీ జయప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థినులు తమ దైనందిన జీవితంలో ఎదుర్కొనే మానసిక ఆందోళనలను అధిగమించేందుకు సూచనలిచ్చారు. ఉన్నత లక్ష్యాలను ఎలా చేరుకోవచ్చో వివరించారు. కార్యక్రమంలో జీసీడీవో జెమీమా, జిల్లా కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సెలర్లు, కేజీబీవీ ప్రిన్సిపాల్ మృదుల, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జీఎస్టీ సేవింగ్స్ ఎగ్జిబిషన్



సూపర్ జీఎస్టీ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మండల ప్రత్యేక అధికారి సరోజిని

పరవాడ: సూపర్ జీఎస్టీ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగ్జిబిషన్‌ను మండల ప్రత్యేక అధికారి ఎం.సరోజిని తిలకించారు. జీఎస్టీ తగ్గిన నేపథ్యంలో ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు ఉంచిన ఎలక్ట్రానిక్ వస్తువులకు పాత, కొత్త ధరల్లో వ్యత్యాసాన్ని వ్యాపారులు వివరించారు. ఎగ్జిబిషన్‌లో ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు, తహసీల్దార్ బి.నాగరాజు, ఉప మండల పరిషత్ అధికారి ఆర్.మురళీధర్‌పట్నాయక్, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాస్, జీఎస్టీ ఓపీ అలివేణి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు



జీఎస్టీ ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంతో కోట్లాది మంది పేదలకు ఎంతో మేలు జరుగుతుందని కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం బీసీ కాలనీలో జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సీవో ఈశ్వరరావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కోలాట బృందానికి మైక్‌సెట్ అందజేత



కోలాట బృందానికి మైక్ సెట్ అందిస్తున్న పూర్ణ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి బీసీ కాలనీలోని వినాయక కోలాట బృందానికి వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ) మైక్‌సెట్ అందించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ ప్రాచీన భారతీయ కళల్లో కోలాటం ఒకటని, ప్రస్తుతం కోలాటం జానపదంతో పోటీపడుతూ ప్రతీ గ్రామాన కోలాట బృందాలు ఆధ్యాత్మిక సేవలో తరిస్తున్నాయన్నారు. కోలాటం ప్రదర్శించడానికి కొత్త మైక్ సెట్ అవసరమని భావించి అందివ్వడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యనిర్వాహక కార్యదర్శి నక్కా రమణబాబు, నాయకులు గర్ల అప్పారావు, కోలాట గురువు జాజుల అప్పారావు పాల్గొన్నారు.

'అంబుజా' వద్దంటూ విద్యార్థుల ర్యాలీ



గో బ్యాక్ అదానీ, గో బ్యాక్ అంబుజా అంటూ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెదగంట్యాడ: అంబుజా సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు గళం విప్పుతున్నారు. మా ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేసి ఆరోగ్యంతో వ్యాపారం చేయవద్దని.. మా భవిష్యత్ నాశనం చేయవద్దంటూ మండలానికి చెందిన గ్రీన్‌వ్యాలీ పాఠశాల విద్యార్థులు శుక్రవారం మండలంలో పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. గో బ్యాక్ అదానీ, గో బ్యాక్ అంబుజా అంటూ ప్లకార్డులతో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్థానికులు, తల్లిదండ్రులు వారికి మద్దతుగా పాల్గొన్నారు. కాలుష్యం కారణంగా పసిపిల్లలు, వృద్ధుల జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి ఈ ప్రాంతంలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ప్రతిపాదనను రద్దు చేయాలని కోరారు.

డ్రాగన్ సాగు.. లాభాలు బాగు



చింతల గొర్లివానిపాలెంలో సాగవుతున్న డ్రాగన్ ఫ్రూట్ పంట



వంటల సాగులో రైతుల దృక్పథం మారుతోంది. సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు, పంటల నుంచి కొత్తదారులు వెతుక్కుంటున్నారు. ఉద్యాన, వాణిజ్య రకాల సాగు ద్వారా లాభాల పంట పండిస్తున్నారు. పరవాడ మండలంలోని గొర్లివానిపాలెం, నాయుడుపాలెం ప్రాంతాల్లో పలువురు రైతులు ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న డ్రాగన్ ఫ్రూట్స్ సాగుపై దృష్టిసారించారు. నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన వీటి సాగు ఇప్పుడు తమకు ఆదాయ ధీమానిస్తోందని ఆనందంగా చెప్తున్నారు.

- సాగుకు పరవాడ రైతుల ఆసక్తి
- మార్కెట్‌లో మంచి డిమాండ్
- ప్రభుత్వం ద్వారా రాయితీ

పరవాడ: మంచి పోషకాలు కలిగిన డ్రాగన్ ఫ్రూట్స్ సాగుకు మండలంలో పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే గొర్లివానిపాలెం, నాయుడుపాలెం తదితర ప్రాంతాల్లో పలువురు రైతులు ప్రయోగాత్మకంగా వీటి సాగును మొదలెట్టారు. మండలంలో తొలుత చింతలగొర్లివానిపాలెంలో ఓ రైతు నాలుగేళ్ల క్రితం ఎకరం పొలంలో వీటి సాగు ఆరంభించారు. రెండో ఏట నుంచి దిగుబడి మొదలైంది. ఏటా రూ.1.50 లక్షలకు పైనే ఆదాయం వస్తుండటంతో మిగిలిన రైతులు కూడా వీటి సాగుకు మొగ్గు చూపుతున్నారు.

పెట్టుబడి కాస్త ఎక్కువే..

డ్రాగన్ ఫ్రూట్ మొక్క ధర రూ.50 నుంచి రూ.70 వరకు ఉంటుంది. 7 అడుగుల సిమెంట్ పోల్ చుట్టూ నాలుగు మొక్కలను నాటొచ్చు. ఎకరంలో 500 సిమెంట్ స్తంభాలకు 2 వేల మొక్కల్ని నాటే అవకాశం ఉంది. ఇతర పంటల కంటే చీడ పీడల బెడద తక్కువ. తొలి ఏడాది మాత్రమే పెట్టుబడి ఉంటుంది. ఆ తర్వాత నుంచి పెద్దగా పెట్టుబడి లేకుండానే పంట దిగుబడి వస్తుంది. పంట పెట్టుబడికి సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చవుతుంది. డ్రాగన్ ఫ్రూట్ మొగ్గ నుంచి పండుగా మారాలంటే 45 రోజులు పడుతుంది. దీన్ని 2 నెలల వరకు పాడవకుండా భద్రపర్చవచ్చు.

ఒక్కసారి నాటితే.. 25–30 ఏళ్లు దిగుబడి

మండలంలో సీఎం రెడ్, తైవాన్ అనే రెండు రకాల డ్రాగన్ ఫ్రూట్ రకాలను సాగు చేస్తున్నారు. వీటిని నాలుగేళ్ల క్రితం జనగాం నుంచి ఒక్కో మొక్క రూ.50 చొప్పున కొనుగోలు చేశారు. వీటినే మిగిలిన రైతులు కూడా తమ వ్యవసాయ క్షేత్రాల్లో సాగు చేస్తున్నారు. ఈ మొక్కను ఒక్కసారి నాటితే 25 నుంచి 30 ఏళ్ల వరకు పండ్ల దిగుబడి ఇస్తూనే ఉంటుంది. ప్రస్తుతం పండించిన డ్రాగన్ ఫ్రూట్స్‌ను మార్కెట్‌కు తరలించాల్సిన శ్రమ లేకుండా పొలం వద్దే అమ్ముడు పోతున్నట్లు రైతులు చెప్తున్నారు. కిలో రూ.160–170 వద్ద అమ్మకాలు సాగిస్తున్నారు. పంట సీజన్ మే నుంచి నవంబర్ వరకు ఉంటుంది.

పోషకాలు బోలెడు

డ్రాగన్ ఫ్రూట్ పలు రకాల యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటుంది. ఇది క్యాన్సర్‌లాంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షిస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. అనేక రకాల విటమిన్లు, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, ఫైబర్ తదితర ఆరోగ్యకారక గుణాలు ఉంటాయని చెబుతున్నారు. ఒక డ్రాగన్ ఫ్రూట్ దాదాపు 100 కేలరీల శక్తిని అందిస్తుంది. చెడు కొలెస్ట్రాల్ లేకుండా గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని, రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తుందని పోషకాహార నిపుణుల మాట.





నాయుడుపాలెంలో ఓ రైతు వేసిన డ్రాగన్ ఫ్రూట్ పంట

తెగుళ్ల బెడద తక్కువ



నాలుగేళ్ల క్రితం ఎకరం విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్ మొక్కల్ని ప్రయోగాత్మకంగా వేశాను. రెండో ఏడాది నుంచి పంట చేతికొస్తోంది. ఏటా దిగుబడులు పెరుగుతూ ఉన్నాయి. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. తెగుళ్ల బెడద కూడా తక్కువ.
– గొర్లి కనకారావు, రైతు, చింతలగొర్లివానిపాలెం

రెండెకరాల్లో సాగు చేస్తున్నా



డ్రాగన్ ఫ్రూట్స్ సాగు లాభసాటని తెలిసి ఏడు నెలల క్రితం రెండెకరాల్లో పంట వేశాను. సీఎం రెడ్, తైవాన్ రకాల మొక్కల్ని నాటాను. మొక్కల పెరుగుదల బాగుంది. పెట్టుబడి కాస్త ఎక్కువైనా అంతకుతగ్గ ప్రతిఫలం వస్తుందని ఆశిస్తున్నాను.
– కూండ్రపు యమహానాయుడు, రైతు, సిమ్మన్నగారి గ్రామం

ప్రభుత్వం రాయితీ ఇస్తుంది



పొలంలో నీరు నిలిచిపోకుండా చూసుకోవాలి. ఆంత్రాక్నోస్, ఫంగస్ సోకినపుడు మాంకోజెబ్, కార్బెండెజిమ్ వంటి మందులను సిఫార్స్ మేరకు వేయాలి. రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో వేసిన డ్రాగన్ ఫ్రూట్ పంటకు మొదటి ఏడాది రూ.1.62 లక్షలు, రెండో ఏడాది రూ.1.08 లక్షల రాయితీ ప్రభుత్వం అందిస్తుంది.
– లావణ్య, హార్టికల్చర్ అధికారి, పరవాడ

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్యామల, సిబ్బంది

పరవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు తానాం గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వై.ఎస్.సుహాసిని శుక్రవారం తెలిపారు. గోపాలపట్నంలో గురువారం నిర్వహించిన పోటీల్లో డి.దివ్యశ్రీ, వి.రమ్య, ఎం.రోషిణి ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఏలూరు దరి పెదవేగిలో జరగనున్న వివిధ అథ్లెటిక్స్ పోటీలకు పాఠశాల విద్యార్థులు ఎస్.మీనా, జి.రూప, బి.మౌనిక, బి.కావ్య, కె.తేజశ్రీ, కె.శ్రీలక్ష్మి, టి.ఝాన్సీ, ఎస్.శ్రావణిలు ఎంపికైనట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తోపాటు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని అభిలషించారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ ఎస్.గౌరీ, చంద్రకళ పాల్గొన్నారు.

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: చాతుర్మాస్య దీక్షలో భాగంగా స్థానిక వేంకటాద్రిపై శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. స్వామివారికి విశేష అభిషేకాలు జరిపారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా గోత్రనామార్చనలు జరిపారు. పలువురు భక్తులు తులాభారం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

చిచ్చురేపిన విగ్రహం తొలగింపు



పాక్షికంగా తొలగించిన విగ్రహం దిమ్మ



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంబేడ్కర్‌నగర్, ఏకలవ్యకాలనీ వాసులు

మహారాణిపేట/పెందుర్తి: పెందుర్తి మండలం చినముషిడివాడలోని తన స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం తొలగించి తన స్థలాన్ని తనకు అప్పగించాలని స్థల యాజమాని చందక శ్రీకృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులను కలిసి వినతి పత్రం అందించారు. తన స్థలంలో కొందరు దౌర్జన్యంగా చొరబడి, నిబంధనలకు విరుద్ధంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. దాన్ని తొలగించేందుకు గురువారం రాత్రి వెళ్లిన రెవెన్యూ అధికారులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. చినముషిడివాడ సర్వే నెం.164 హెచ్‌ఐజీ–2లో ప్లాట్ నెం.2ను 2004లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆ స్థలాన్ని ఇందిర అనే మహిళ ఆక్రమించిందని, తనకు రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆ వినతిలో ఆరోపించారు. సొమ్ము ఇవ్వకపోవడంతో తన స్థలంలోకి అక్రమంగా చొరబడి అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి, తనను ఇబ్బంది పెడుతున్నట్లు శ్రీకృష్ణ పేర్కొన్నారు. దీనిపై కోర్టులో కేసు వేయగా, కోర్టు తీర్పు తనకు అనుకూలంగా వచ్చిందన్నారు. కోర్టు ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం విగ్రహం తొలగించేందుకు రెవెన్యూ అధికారులు వచ్చారని, స్థానికులు అడ్డుకుని దాడులకు దిగారని, తనకు ప్రాణ భయం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయం చేసి తన స్థలాన్ని తనకు అప్పగించాలని ఆ వినతి పత్రంలో కోరారు.

కాలనీవాసుల ఆందోళన

దాదాపు రెండు దశాబ్దాలుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు అర్ధరాత్రి వేళ ముసుగులు వేసుకుని తొలగించే ప్రయత్నం చేయడం దుర్మార్గమని చినముషిడివాడ సమీపంలోని అంబేడ్కర్ నగర్, ఏకలవ్యకాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల ప్రతినిధులు మాట్లాడుతూ గతంలో ఇదే విగ్రహాన్ని తొలగించాలని అధికారులు ప్రయత్నం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పుడు భారీ ఆందోళన చేస్తే ఆ ప్రయత్నం విరమించుకున్నారన్నారు. తాజాగా అధికారులు, సిబ్బంది ముసుగులు వేసుకుని విగ్రహాన్ని తొలగించాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. విగ్రహ తొలగింపు ప్రక్రియ నిలుపుదల చేయకపోతే భారీ ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

దువ్వాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి అభిప్రాయ సేకరణ



వినతిపత్రం అందిస్తున్న దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: అమృత్ సంవాద్ కార్యక్రమం ద్వారా ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపర్చడంలో భాగంగా ప్రజా సంఘాలు, ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్నామని తూర్పుకోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ ఆపరేషన్స్ విభాగం ప్రాంతీయ మేనేజర్ ప్రణవ్ జెట్లీ అన్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌ను ఆయన సందర్శించి ప్రజా సంఘాలతో సమావేశమయ్యారు. అభివృద్ధి కార్యక్రమాలు, రాబోయే రోజుల్లో కల్పించాల్సిన సౌకర్యాలపై తూర్పు కోస్తా రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వే స్టేషన్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమై అభిప్రాయాలు స్వీకరించారు. నాలుగు రోజుల కిందట వాల్తేరు రైల్వే డీసీఎం పూజా సింగ్ సందర్శించి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు.

వినతులు ఇలా..

శ్రీకాకుళం నుంచి విశాఖ మీదుగా రాజమండ్రి, కాకినాడకు షటిల్ సర్వీస్‌లు నడపాలని, విశాఖ నుంచి బయల్దేరుతున్న రైళ్లకు రెండు నిమిషాల బదులు ఐదు నిమిషాల పాటు హాల్ట్ ఇవ్వాలని కోరారు.

☛ విశాఖపట్నం – సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న వందే భారత్‌కు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని, విశాఖ నుంచి షిర్డీ, కొల్లాం, గాంధీథామ్, వారణాసి రైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచాలని, విశాఖ తిరుపతి మీదుగా బెంగళూరు, చెన్నైకు రోజువారీ రైళ్లు నడపాలని, దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పార్సిల్ సర్వీస్‌లను ఏర్పాటు చేయాలని విన్నవించారు.

☛ కొన్ని సందర్భాల్లో ఒకటి, నాలుగో నంబర్ ప్లాట్‌ఫారాలపై గూడ్స్ రైళ్లు నిలిపివేస్తున్నారని, దీని వల్ల అప్పటికప్పుడు ప్రయాణికులు పరుగులు తీయాల్సి వస్తుందని, ఈ రెండు ప్లాట్‌ఫారాలపై గూడ్స్ రైళ్ల రాకపోకలు నిరోధించాలని ప్రజా సంఘాల ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలోయూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వి.జాషువ, కె.విజయ్‌కుమార్, సరోజినీ, మానవేంద్రనాథ్, రైల్వే అధికారులు రవి, కిరణ్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో తీవ్ర అనర్థాలు



అయ్యప్పనగర్ వద్ద మత్తు పదార్థాలపై అవగాహన కలిగిస్తున్న ఎస్‌ఐ ఎస్‌వీ భాస్కరరావు

పెందుర్తి: మత్తు పదార్థాల వినియోగం వలన జీవితాలు నాశనం అవుతాయని పెందుర్తి లా అండ్ ఆర్డర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.భాస్కరరావు అన్నారు. గంజాయి, గుట్కా, బ్రౌన్ షుగర్ వంటి మత్తు పదార్థాలు కలిగి ఉంటే జైలు పాలు కావాల్సి వస్తుందని హెచ్చరించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, అయ్యప్పకాలనీ ఆటో స్టాండ్ వద్ద డ్రైవర్లకు మత్తు పదార్థాల వినియోగం, రవాణా వల్ల కలిగే ఇబ్బందులపై శుక్రవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ భాస్కరరావు మాట్లాడుతూ యువత భవిష్యత్‌ను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రవాణా గానీ, ఎక్కడైనా నిల్వలు ఉన్నట్లు తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. వివరాలు అందించే వారి సమాచారం గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. పలు అంశాలపై సూచనలు ఇచ్చారు. పోలీస్ సిబ్బంది, ఆటో స్టాండ్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా స్వయం సమృద్ధికి శిక్షణ



మాట్లాడుతున్న మహిళా సమాఖ్య సభ్యులు

సబ్బవరం: మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రొగ్రాంను శుక్రవారం నిర్వహించారు. హక్దర్షక్ ఎంపవర్‌మెంట్ సొల్యూషన్స్ ప్రై.లి. ఆధ్వర్యంలో డీబీఎస్ ఫౌండేషన్ సహకారంతో దీన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ఏపీఎం సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొని ప్రొగ్రాం ఉద్దేశాలను వివరించారు. మహిళలు వ్యాపార అవగాహన పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో వ్యాపారం ప్రారంభించేందుకు రిజిస్ట్రేషన్, ఫుడ్ సర్టిఫికెట్ పొందడం, ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు, వ్యాపార నియమావళి తదితర అంశాలను హక్దర్షక్ కోఆర్డినేటర్ వి.నాగరాజు, ట్రైనర్ శ్రీవిద్య వివరించారు. కార్యక్రమంలో సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరంలో గర్భకోశ చికిత్సలు



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న గండి బాబ్జి, తదితరులు

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో పశుసంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో శుక్రవారం ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం, పాడి రైతుల అవగాహన సదస్సును ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ గండి బాబ్జి ప్రారంభించారు. ఈ శిబిరంలో 46 పశువులకు గర్భకోశ చికిత్సలు, పేడ, రక్త పరీక్షలు నిర్వహించారు. 32 లేగదూడలకు నట్టల నివారణ మందులు, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సబ్బవరం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ఉషాకుమారి, పశు వైద్యులు జి.అరుణ, ఎస్.స్వర్ణలత, గ్రామ నాయకులు తమరాణ బంగారినాయుడు, అంగటి నాని, తమరాణ సత్యనారాయణ, మేడపాటి రాము, బైలపూడి రాంబాబు, పశుసంవర్ధక శాఖ సహాయకులు త్రినాథ్, రమేష్, ల్యాబ్ టెక్నీషియన్ మళ్ల శంకర్ పాల్గొన్నారు.

'ఎదిగే ఆడపిల్ల' పుస్తకాల పంపిణీ



ఎదిగే ఆడపిల్ల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, (ఇన్‌సెట్) పుస్తకం ముఖచిత్రం

పెందుర్తి: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 'ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి' అనే పుస్తకాన్ని విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ డాక్టర్ ఎం.రమాదేవి రచించిన ఈ పుస్తకంలో కౌమార దశలో ఉన్న ఆడపిల్లలకు అవసరమైన సమాచారం అంతా ఉందన్నారు. రోజువారీ జీవనంలో ఆడపిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇందులో పొందుపరిచారన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐద్వా మహాసభల విజయవంతానికి పిలుపు



రాష్ట్ర మహాసభ జెండాను ఆవిష్కరిస్తున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో అనంతపురంలో ఈ నెల 16న జరగనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం పిలుపునిచ్చారు. స్థానిక టిడ్కో కాలనీలో శుక్రవారం నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలపై రోజురోజుకూ పెరుగుతున్న దాడుల్ని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళలకు నైట్ షిఫ్టులు వేయడం సరికాదన్నారు. 13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలన్నారు. సూపర్ సిక్స్ హామీ మేరకు 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున తక్షణమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జాయింట్ సెక్రటరీ తుంపాల అన్నపూర్ణ, మండల అధ్యక్షురాలు మన్యాల బంగారమ్మ, అరుణ, వరలక్ష్మి, బేగం, లక్ష్మి, అనసూయ, కృపా, గోపాలరావు, శంకర్రావు పాల్గొన్నారు.

దొంగ ఓట్ల నియంత్రణకు సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెందుర్తి: ప్రతి ఎన్నికల్లోనూ దొంగ ఓట్ల ప్రభావం చాలా తీవ్రమవుతోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కనన్వీనర్ విన్నకోట రాము ఆరోపించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ దొంగ ఓట్ల నిరోధానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దొంగ ఓట్ల నియంత్రణ డిమాండ్‌తో పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దొంగ ఓట్ల ప్రక్రియ భారీగా ఉందన్నారు. దీనివలన ప్రజాస్వామ్య వ్యవస్థ గాడి తప్పుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడం శోచనీయమన్నారు. అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, నాయకులు ముక్క రామునాయుడు, ఆర్‌ఆర్ నాయుడు, గండి సన్నిబాబు, నక్కా భీమారావు, పిడిది ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రేన్ యజమానుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో పాల్గొన్న జిల్లా హెవీ క్రేన్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

పెందుర్తి: క్రేన్‌ల యజమానుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసస్తున్నట్టు విశాఖపట్నం హెవీ క్రేన్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పూసపాటి రాజేష్ అన్నారు. ఎస్ఆర్ పురంలో జరిగిన వీహెచ్‌సీవోఏ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీల్లో పని చేసిన బిల్లుల చెల్లింపుల విషయంలో క్రేన్ యజమానులకు అండగా నిలుస్తామన్నారు. విశాఖపట్నం చాంబర్ ఆఫ్ కామర్స్‌తో, నగర విపత్తు నిర్వహణ సంస్థతో కలిసి తీవ్రమైన తుపానులు, ఇతర సంక్షోభ సమయంలో జిల్లా అధికారులకు వీహెచ్‌సీవోఏ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. పరస్పర ప్రయోజనం, సంక్షేమం కోసం సభ్యులంతా ఏకతాటిపై రావాలని కోరారు. పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు లీలా రాఘవరావు, వెంకుమహంతి చంద్రశేఖర్, కోశాధికారి పీలా కోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్ సుబ్రహ్మణ్యం, అడ్వైజర్ శంకర్‌నారాయణ, రవికుమార్, ఎల్.వినయ్‌కుమార్, కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.